# పార్కులో పెద్దమనిషి

సాయంత్రం అయిదుగంటలయింది దుస్తులు తొడిగి ఏమీ ఎంగేజిమెంట్సు లేక, స్నేహితులెవ్వరూ కనపడక పోవటంవల్ల మెల్లిగా రిపబ్లిక్ గార్డెన్ చేరుకొని, గార్డెన్‌లో ఓ మూల బల్లపై కూర్చుని ప్రకృతిశోభ తిలకిస్తున్నా.

నాకు కొద్దిదూరంలో ఓ పెద్దమనిషి కూర్చున్నాడు అతను తన వస్తువేదో పోయినట్లు అందోళనగా వెతుక్కో ప్రారంభించి, చుట్టుపక్కల కలియచూచాడు అల్లంత దూరంలో కొందరు పిల్లకాయలు గల్లంతు చేస్తున్నారు. తిరిగి—నిస్పృహతో తన దృక్కుల్ని నా వైపు కేంద్రీకరించి చప్పున ముఖం తిప్పుకున్నాడు.

పాపం, తనేమన్నా పోగొట్టుకున్నాడేమో నని కొంచం విచారపడ్డాను. ఐనా అతడి గ్రహచారానికి నేనేం చెయ్యగల్ను ? నిశ్శబ్దంగా ఎప్పటివలె కూర్చునివున్నా.

అర్ధనిమిషం గాబోలు...అంతే.

ఎంచాతో— నా మనస్సు తొందరించడం చాత ఆ మనిషివైపు అప్రయత్నంగా నా కళ్లు ప్రసరించాయి అతనుమటుకు ఏమీ కానట్లు నిశ్చలంగా కూర్చుని ఏదో ఆలోచిస్తున్నాడు ఎంచాతో, తటాల్న అతను నా వైపు తిరిగిచూచి, నే నతణ్ణి చూస్తోన్నానన్న విషయం గ్రహించుకున్న చిరునవ్వు విసిరాడు. నేను మొదట కంగారు పడినా బాగుండదనుకొని ప్రత్యుత్తరంగా చిన్నగా నవ్వాను

ఈసారి ఇరవై సెకండ్లవరకూ మా యిద్దరిలో ఏ మార్పూ కలగలేదు—

తరవాత— అతను వెంటనే లేచి నా వైపుకి రావటం మొదలెట్టాడు. వచ్చి, సరాసరి నా పక్కనే బల్లపై సుఖోపవిష్టుడై —

" ఏకాంతంగా తోస్తున్నది కదండీ! " అన్నాడు.

"అవును" అన్నా.

"మీ రేదో ఆలోచిస్తున్నట్లు కనపడ్డారు."

నేనా ? మీరూనూ అంగా మనుకున్నా—ఏమనుకుంటాడోనని—

"ఆహాఁ—మరేమీ కాదు. చెట్లను, రకరకాల పువ్వుల్ని, ఝుంకారం చేసే తుమ్మెదల్ని చూస్తోంటే ముచ్చటగా వుంది" అన్నా సర్దుకుని.

"అవున్లెండి, కాని—(తటాల్న ఆగి) మిమ్మల్ని ఎక్కడో చూచినట్లు నాకు జ్ఞాపకం" అన్నాడు.

ఇతను నన్నెక్కడ చూచాడు చెప్మా అనుకొని అతడి రూపాన్ని స్మృతికి తెచ్చుకుంటూ—

"ఎక్కడ చూచారు! నేను మిమ్మల్ని ఎరగను" అన్న ఆశ్చర్యంగా.

"కింగ్సువే రోడ్డుగుండా అప్పుడప్పుడు ఖులాసాగా వెళ్తూంటారు గదూ ?" అనడిగాడు.

సికింద్రాబాడ్‌లో కింగ్సువే రోడ్డుగుండా వెళ్ళని షోకేళా పురుషు డెవరు ? పని వున్నా లేక పోయినా కబుర్లు చెప్పుకుంటూ అటు వెళ్ళటం నాబోటివారికి కద్దు

"అయ్యో ! కింగ్సువేగుండా వెళ్లనివాళ్లెవరండీ ?" అన్నా

"తమ పేరు చెప్పారు కాదు."

"రమణారావు అంటారు."

ఏదో ఆలోచించినట్టు కనపడి, మళ్లీ తేరుకుని:

"అన్నట్టు—తమరేం చేస్తున్నారు ?"

రైల్వేలో క్లర్కుని" అన్నా క్లుప్తంగా.

"అయితే Pay Commission ప్రకారం మీ జీతాలు జూన్ నెల్లో హెచ్చవుతాయని అన్నారే? నిజమేనా ?" అని ప్రశ్నించాడు.

"మీరు విన్నవరకూ నిజం" అన్నా.

"మీకు పెళ్లయిందా ?

తెల్లబోయి చూచా ముఖలక్షణాల్ని కని పెట్టాడు కాబోలు అత నూసే టందుకున్నాడు.

"అంటే—యీ రోజుల్లోకూడా మీ వయస్సువారికి అనగా ఇరవైలోపుగా వున్న యువకులకి పెళ్ళిళ్లయిపోయి, సంసారాలు సాగిస్తున్నారు. మీరు కూడా..."

"అదేమీ లేదండీ" అన్నా.

"ఆహాఁ...(దగ్గి) మీకు కాఫీ

కుచ్చు సుబ్రహ్మణ్యం

అలవాటు వుందనుకుంటా."

నా కాఫీ కస్త వినుగూ కోపం కల్గించాయ్ ఆ మాటలు, ముక్తసరిగా అన్నా—

"చూడండి! కాఫీ అలవాటయినవాళ్లు దాన్ని చప్పున మానలేరు. మీకూ కూడా అలాగే వుంటుందేమో. ఒక్కొక్కరికి ఒక్కొక్క అలవాటండీ! చూడండీ!—నాకు సిగరెట్టు అలవాటుపడ్డది. పదిహేడేళ్లు గడిచాయి. ఇవేళ ఎంచాతో అది లేక ప్రాణం పోయినట్టుగా వుంది, మనస్సేమీ నిమితంగా లేదు దయచేసి-మీ దగ్గర ఒక్క సిగరెట్టూ అగ్గిపెట్టె ఉంటే ఇస్తారూ?"

చాల దీనంగా అడిగాడా పెద్దమనిషి.

నాకు—నిజంగా కాఫీ టీలు బాగా అలవాటయినా సిగరెట్టు పీల్చటంమటుకు అలవాటు లేదు.

"నేను సిగరెట్టు తాగనండీ! నా దగ్గరఏమీ లేదు" అని సిగ్గుపడుతూ జవాబిచ్చాను.

ఉస్సురని దీర్ఘంగా ఓ నిట్టూర్పు విడిచి నా కరం కానట్టు చప్పున నా పక్కనుండి లేచిపోయి, నా ముఖమైనా చూడకుండా గబగబా ఎక్కడికో వెళ్ళిపోయాడా పెద్దమనిషి!


లైసెన్సు
అవసరంలేదు !



అమెరికన్ మాడల్ రివాల్వరు

మీ ప్రాణ, ధన, మానాలను రక్షించుకొనుటకు

ఆరుగుండ్లు గల ఆటోమాటిక్ రివాల్వింగు తిక్కుతో 15 ఔన్సుల బరువు, 9 అం॥ పొడుగుగల ఈ పిస్టలు గొప్ప శబ్దమును, నిప్పురవలనూ వెలువరించును. నేడే ఆర్డరివ్వండి.

నెం. 222 నెం. 333 నెం. 444

రు. 6/8. రు. 7/8. రు. 8/8.

అదనంగా 1 డజను తోటాలు రు. 4/8. తోలుపటకా పిస్టలు కేసుతో ఒక్కొక్కటి రు. 5. పిస్టలు తుపాకీ సీసా రు. 1.

విల్సన్ ట్రేడింగ్ కార్పొరేషన్,

పోస్టు బాక్సు 247, కాన్పూర్ (యు.పి.)


# 'సోషలిస్టు' అంటే?-

అడ్డాల సుబ్బరాజు

ఏ వ్యక్తి తన మనోప్రపంచంలో ఉత్తమోత్తమమైన ప్రపంచాన్ని చూడగలుగుతాడో, ఆ వ్యక్తి ఆ ప్రపంచంలో వెనువెంటనే సభ్యుడౌతాడని ప్లాటోమహనీయుడు రిపబ్లిక్ అనే పుస్తకంలో వ్రాశాడు అట్టి సభ్యుడే సోషలిస్టు

సోషలిస్టు కేవలం ధనికవర్గాన్నే ద్వేషిస్తాడు. ధనికులను ద్వేషించకుండా వారూ కష్టజీవులతోపాటు మానవులేననే వేదాంతదృష్టితో చూస్తాడు అయినప్పటికి సోషలిస్టు తన జీవితాన్ని, కాలాన్నీ, ధనికవర్గానికి వ్యతిరేకంగా జరుగు వర్గపోరాటానికి కార్మికులయొక్క అభ్యుదయానికి వినియోగపరుస్తూ కష్టజీవులలో శాస్త్రీయ రాచకీయ పరిజ్ఞానం పెంపొందించుతూ తద్వారా సోషలిస్టు విప్లవ సాధనకు కృషిచేస్తాడు.

అతడు యిట్లా ఎందుకు చేస్తాడూ అంటే భావిలో ఏర్పరచబోయే ఏ వర్గరాహిత్య సహకార సమాజనిర్మాణానికి ప్రస్తుతం ఏర్పడ్డ ధనికవర్గాధిక్యత అను మంచుగడ్డను కరగించవలసిన అవశ్యకత ఉందని గుర్తించటంచేత. సోషలిస్టు నాయకులు ఎల్లప్పుడు సోషలిస్టు రాజ్యాంగంలో ఉండవలసిన పౌరులుగానే వ్యవహరిస్తూ ధనికవాదంయొక్క ప్రలోభాలకు దూరంగా ఉంటారు. తమయొక్క ఆశయసాధనకోసం లక్ష్యసిద్ధికోసం ఎట్టి కష్టాలకైనా వెనుదీయరు. అందుకొరకై తమ సుఖాలనుకూడా కొల్పోవ గలుగుటకు సంసిద్ధులౌతారు ఇటువంటివారు బహు కొద్దిమంది నాయకులు మాత్రమే ఉన్నారు. అయిననూ యీ కొద్దిమంది స్వార్థత్యాగుల జీవితాలే మహా విప్లవాలను రగుల్గొల్ప గలుగుతవి ఈ దేశంలోనే కాకుండా యితరదేశాల్లోకూడా శ్రామికవర్గ పోరాటంతో సంబంధం ఉన్న ప్రతి సోషలిస్టు అంతులేని ఉత్సాహంతో తనకు పరిచయంలేని సామాన్య స్త్రీ పురుషులందరితో పరిచయం ఏర్పరచుకొని వారి దైనందిన జీవిత సమస్యల్లో తానూ భాగస్థుడౌతూ వారి అభిమానాన్నీ. ఆదరాన్నీ పొందగోరుతూ ఉంటాడు.